# ఘటన ఉండొద్దూ - పెళ్లిజరగడానికి - మన ఇష్టమా?

——శ్రీ ఎమ్. వి. సూర్యనారాయణమూర్తి——

ఆవేళ నన్ను పెందరాళే లేపేసింది మా అమ్మ. సాధారణంగా ఏడుగంటలుదాటేక లేచే మనిషిని ఈ నాడు చాలతొందరగానే లేవగొట్టబడ్డంలో ఏదో వింత విశిష్టత ఉండొచ్చని ఊహించుకుని నిర్ధారణ చేసుకున్నాను. పెందలకడే లేవడం నా దేహానికి ఆనమాయితిలేదు. ఆవేళ ఆనమాయితీ తప్పడం మూలాన్ని ఈ క్షుద్రదేహం ఎంతో క్షోభించింది. ఈ దేహానికి కావలసినవన్నీ సకాలంలో అందచెయ్యాక పోతే ఎంతైనా కోపంవస్తుంది. ఆగ్రహం సత్యాగ్రహం అవుతుంది. అంచేత ఆ విషయంలో ఏమీ శక్తి ఉన్నంతవరకూ లోటుబాటు రాకుండా ఉండేలాగున ప్రయత్నిస్తూంటాను. అంత ఆర్టిఫిషల్ దేహం అయిపోయింది.

నేను లేవడం తరవాయిగా మా అమ్మ చెంబూనీళ్లూ పుడక పట్టుకొచ్చి అక్కడపెట్టి 'చప్పున మొహం కడుక్కోరా!' అని నిలబడింది. బధకం ఎక్కువగాఉండడం మూలాన్న 'ఊ' అని గట్టిగా అన్నాను. అమ్మ హడిలిపోయింది. ఇంక వీడు మాటలతో వినడని స్వయంగా పుల్లని రుబ్బురోలు పొత్రంకింద నలగకొట్టి బ్రష్‌లా తయారుచేసి పట్టుకొచ్చి నానోట్లో పెట్టింది. 'లేరా నాయనా' అంటూ బతిమాలుతూ నాదేహాన్ని దొడ్లోకి తీసుకొచ్చి నూతిచప్టామీద కూచోపెట్టింది. అప్పటికీ బధకం అనే పదార్థాన్ని నా దేహంలోంచి తీసివెయ్యలేదు. మా అమ్మ ఆతురతా ఎక్కువవుతున్నట్లు ఆమె మొఖమే చెప్తోంది. ఆలస్యాన్ని భరించలేకపోయింది. గబగబ వచ్చి నా తలమీద చెయ్యేసి పుల్లపట్టుకుని పళ్లుతోమడం ప్రారంభించింది. అప్పటికి నాకు పదిహేను వెళ్లాయి. నా వయస్సు నాకు సిగ్గు తెప్పించింది. 'ఊ' అని మళ్లీ కసిరి స్వంతంగా మొహంకడగడం మొదలెట్టేను. ఆమె అలాగే నుంచుంది. నా వ్యవహారం గూడ్సు ట్రెయిన్‌లా కనబడింది. 'నే కడుగుతాను ఫరవాలేదురా, నాయనా' అంది. ఆ మాటల్లో ఎంత తల్లిప్రేమ యిమిడిందో అర్థంకాదు. ఆ మాతృప్రేమతో కూడుకున్న ఆ మాట నన్ను ఒక్కసారి కలవరపెట్టింది. రెండు సార్లు నేను ఆమెను గట్టిగా కసరడం నాకు జ్ఞప్తికివచ్చింది. ఆ ప్రేమ ఎంతకాఠిన్యాన్నైనా అసహ్యాన్నైనా మింగేస్తుంది. నాలో నేనే నా కాఠిన్యానికి మనస్సులో కించిత్కాలం కుళ్లిపోయాను. 'ఏమే-అమ్మా-ఈ వేళ ఇంత పెందరాళే లేపించావ్?' అనే చిన్నస్వరంతో కూడుకున్న మాటననిపించింది. తల్లిని ఏమే అమ్మాఅని పిలవడం ఇప్పటివరకూ పోలేదు. ఒక్కొక్కసారి లోలోపల నవ్వొస్తూంటుంది ఈ సంబోధన జ్ఞప్తికి వచ్చినప్పుడు, కొంచెం విచారంకూడా వేస్తూంటుంది. కాని నేనొక్కణ్ణే అలా పిలవటం లేదని సమర్థించుకుంటూ ఊరుకుంటాను.

'ఏమీలేదూ - ముందు అవశిష్టాలన్నీ కానియ్యి,' ఎందుకో ఈ తొందర నాకర్థంకావటంలేదు, అన్నీ అయాయి. చద్దన్నందగ్గర కూచున్నాను. 'ఈ వేళ - నీకెవరో పిల్లనిస్తామని తూర్పునుంచి వచ్చారు. నిన్ను చూడ్డానికి వస్తారు. అంచేత చాకలితెచ్చిన బట్టకట్టుకుని, శుభ్రంగా నున్నగా తలదువ్వుకుని ఎంతో మంచివాడనిపించుకునేలాగ ఉండాలి.' అందా మాతృహృదయం. ఆహృదయంలో ఉప్పొంగుతూన్న ఆనందాన్ని గ్రహించలేం.

కొబ్బరినూనె పట్టుకొచ్చి తలకిపూసింది. తలదువ్వింది. నూనె ఎక్కువవడం మూలాన్ని చెంపలంట నుదురంట కారడం మొదలెట్టింది. నాలో నాకే ఊరికే నవ్వు తోసుకొస్తోంది. కారణం అర్థంకావటంలేదు. అమాయకమైన ఆ మాతృప్రేమని చూశా? ఒకయింటివాణ్ణి అవదలచుకున్నందుకా?

సరిగ్గా ఆ రెండింట్లోనూ దేనికి నవ్వొస్తోందో నిర్ధారణ కావటంలేదు. రెండూ నవ్వు తెప్పించేవే? ఏనాడూ శుభ్రంగాను, మంచిగాను ఉండనిమనిషి ఎవరో ఎందుకో చూసిపోయ్యేందుకు వస్తూంటే నేనలంకరింపబడ్డం ఎందుకు? బట్టల్లోనూ, తలదువ్వుకోవడంలోనూ నేర్పరి అయిఉంటే చాలుకాబోలు!! తన పెద్ద కొడుకుకి దూరాన్నుంచి పిల్లనిస్తామంటూ వచ్చేరనే ఆనందం ఆ మాతృ హృదయాన్ని అలా కలవరపరుస్తూంటడం లోకంలోని సామాన్య గుణమే!!

ఒకయింటివాణ్ణవతున్నానూ అనే సరదాకూడా వేసుకొచ్చింది. ఆ సరద్దా ఎంతవరకు? పెళ్లికి బయల్దేరేసమయం దగ్గర్నుంచి ఆ బాజాలు చప్పళ్లు వింటూంటేను ఆ పౌరోహితుడు కార్యాన్నంతనీ చేయిస్తూంటేను సుమంగళి ఆ అమాయిక కంఠానికి పెనవేస్తూంటేను మిగతా చిన్న చిన్న అలకపాన్పులు వగైరాలు అయీవరకూనే!!! పెళ్లయిన మర్నాడు హృదయం ఎంతో బరువుగా ఉంటుంది, ఆ సుఖం క్షణమాత్రమే!!

మా స్నేహితుడు మొన్నటివరకూ పెళ్లిచేసుకోరా అని అంటే అగ్గిఅయిపోయేవాడు. 'ఏరా నీకంత అసహ్యం?' అంటే 'జీవితంలో సెటిల్ అవనీరా,—ఇప్పటికీ ఒక్క పొట్టకే గడవడం కష్టంగా ఉందీ—ఇంకో పొట్టనికూడా మెడకు తగిలించుకుని దాన్నికూడా మల మల మాడ్చడం ఎందుకూ?' అనీవాడు. ఈ సమాధానం కాస్త సమంజసంగానే ఉంది. ఈ దారిద్ర్య దినాల్లో పెళ్లిళ్లు అనే మతకలయికలన్నీ పెట్టి ఎంత పెద్దచదువుచదివినా దమ్మిడీ సంపాదించలేకుండా ఉన్నవాళ్లకి పెళ్లాల్ని అంటించడం చూస్తే ఈ బాధపడేవాళ్లని ఇంకా హింసపెట్టదలచుకుందుకు రోషంతో మామలందరు కూతుళ్లని తగిలించ దలచుకుంటున్నారే! అని ఓ వింత అభిప్రాయం ఒక్కొక్కసారి మెరుపులా కనిపించి మాయమౌతూంటుంది.

అప్పటికి ఎనిమిది కొట్టింది. ఎంతో శ్రద్ధా భక్తుల్తోటి చదువుకునీవాడిలాగ నా అంతట నేనే పెళ్లి అనేమాట వినడంతోటే ఒక విధమైన ఆవేగమో, ఉత్సాహమో నాలో ఉబుకుతూండడం మూలాన్ని పెద్ద లావుపుస్తకం తీసేను. లావుపుస్తకాలు మా క్లాసుకెక్కడుంటాయి - అది డిక్షనరీ - ఏదో రిఫర్ చేస్తూన్నట్టు పేజీలు ఊరికినే ఇటూ అటూ తిప్పడం మొదలెట్టాను. చేతులు నెప్పెట్టుతూన్నట్టు కనిపిస్తోంది గాని నా హృదయం ఆవేశంతో దోబూచు లాడుతూన్నట్టు పేజీలింకా తీవ్రంతో ఇటూ అటూ గబ గబా తిప్పేస్తున్నాను. ఈలోగా మా నాన్న వచ్చాడు. నా ప్రవర్తనంతా నవ్వుతెప్పించింది. గట్టిగా నవ్వేసాడు. ఒక్క నా నడవడికేకాదు నవ్వుతెప్పిస్త, మా నాన్నకీ కొడుక్కి పెళ్లవుతుందనీ కోడలొస్తుందనీ సంబరంవల్ల కూడా నవ్వొచ్చింది.

'ఒరేయి నువ్విలాగే ఇంకోగంటసేపు కూర్చో, ఈ లోపుగానే వెళ్లి ఆయన్ని కలుసుకుంటాను' అంటూ అతనికాళ్లు జోళ్లదగ్గరికెళ్లాయి.

'కతుకుతే అతుక'దన్న సామెతమూలాన్ని అవబోయే మామగారు మా మేనమామగారింట్లో భోంచేసి అక్కడే రాత్రిగడిపి ఉదయాన్నే కాఫీలుకూడా ఆరగించి నా దర్శనంకోసం ప్రయాణం అవుతున్నారు. ఆవేళ శనివారం అవడంమూలాన్ని పొద్దున్న ఏడుగంటలవరకూనో 8 గంటలవరకూనో దుర్ముహూర్తంవేళ అవడంవల్ల ఇంకా నిరీక్షిస్తూ కూచున్నారు. మా నాన్నా సరిగ్గా దుర్ముహూర్తంవేళ దాటడం తరవాయిగా గబ గబ వారికి ఎదురు సన్నాహం వెళ్లి ఆహ్వానపత్రాన్ని అందిచ్చాడు.

మా యింటిముందర బండిచప్పుడయింది. వెయ్యి తేళ్లూ జెర్రులూ నా దేహంలో పాకుతున్నట్టయింది. ఒకవిధమైన భీతిచేత కళ్లు కాళ్లూ తొట్రుపడుతున్నాయి. ఆయన వచ్చేశారుకదా అని నా బుర్ర